క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రి ఏఓపై చర్యలు తీసుకోండి


విచారణాధికారికి వినతిపత్రం ఇస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

గుంతకల్లుటౌన్: అవినీతి, అక్రమాలతో పాటు మహిళా సిబ్బందిని తీవ్ర వేధింపులకు గురిచేసిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఏఓ రామ్‌ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని విచారణాధికారిగా నియమితులైన గుంటూరు జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మజీదాబీని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. శనివారం విచారణ నిమిత్తం ఆస్పత్రికి విచ్చేసిన ఆమెను ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏఓ రామ్‌ప్రసాద్ అక్రమాలు, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే రెండుసార్లు ప్రభుత్వం విచారణ చేపట్టినా అతడిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని సురేష్ ప్రశ్నించారు. ఏఓను కాపాడి అధికారపార్టీ నేత మెప్పు పొందడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని, అతడిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడుతామని సురేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, సత్తార్, ఆశాబీ, మాబున్నీ, నారాయణ పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్'కు ఉచిత శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌రావు

గుంతకల్లుటౌన్: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాయనున్న విద్యార్థుల కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో సిద్దార్థ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మస్తాన్‌రావు సూచించారు. శనివారం శిక్షణ తరగతులను ఎంఈఓ ప్రారంభించారు. ఏబీవీపీ నాయకులు విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు వారి శ్రేయస్సు కోరుతూ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శివరాజ్, పూర్వ కార్యకర్త అంజినమ్మ, పట్టణ కార్యదర్శి వంశీ, వసీమ్‌ఖాన్, కార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

7న కంటి వైద్య శిబిరం

శింగనమల: మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుట్టపర్తిలోని శంకర నేత్రాలయం సంచార శస్త్ర కంటి చికిత్స విభాగం వారిచే శిబిరం నిర్వహిస్తామన్నారు.

బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలి


మాట్లాడుతున్న చంద్రమోహన్

బుక్కరాయసముద్రం: బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలని మడకశిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ సీనియర్ అధ్యాపకురాలు భారతీదేవి, తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఈఈఈ విభాగం అధ్యాపకుడు చంద్రమోహన్ సూచించారు. శనివారం మండలంలోని కొర్రపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాలికల విద్య, ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికలు చదువుకుంటే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గుత్తి: పూర్తైన టిడ్కో ఇళ్లను వెంటనే ప్రభుత్వం లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలోని నేమతాబాద్ వద్ద ఉన్న టిడ్కో ఇళ్లను శనివారం సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, మండల కార్యదర్శి నిర్మల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, కేవీపీఎస్ నాయకులు మల్లికార్జున తదితరులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పూర్తైన ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కన్నీటి పంటలు




పెద్దపప్పూరులో గాలీవానకు దెబ్బతిన్న టమాట పంటను వదిలేసిన దృశ్యం


నేలకొరిగిన అరటి గెలలను గొర్రెల మేత కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: గాలీవాన కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతినడంతో అన్నదాతలు మనోవేదనకు గురవుతున్నారు. పెద్దపప్పూరు మండలంలో దాదాపు 6 వేల ఎకరాల్లో అరటిపంట, 200 ఎకరాల్లో టమట పంట సాగు చేశారు. 10 రోజుల వ్యవధిలో అరటిపంట చేతికొస్తుందన్న తరుణంలో రెండురోజుల క్రితం గాలీవాన కురిసింది. దీంతో అరటిచెట్లు నేలమట్టమయ్యాయి. అలాగే కోత దశలో ఉన్న టమాట పంట వర్షం కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో అన్నదాతలు వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. నేలకొరిగిన అరటి గెలలను రైతన్నలు చూడలేక గొర్రెల కాపరులకు తీసుకెళ్లమని చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో పాటు చేతికొచ్చిన పంట నేలవాలడంతో .. చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ రైతన్నలు మధనపడుతున్నారు. ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకుంటే తప్ప కోలుకోలేమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

యాడికి/పుట్లూరు/శింగనమల: రెండు రోజుల క్రితం గాలీవాన కారణంగా దెబ్బతిన్న పండ్లతోటలను శనివారం సీపీఐ నాయకులు పరిశీలించారు. యాడికి మండలం చందన గ్రామంలో నష్టపోయిన రైతులను రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంగటరాముడు యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి ఓబిరెడ్డి, శ్రీరాములు, సీపీఐ నాయకులు శివన్న, బండారు రాఘవ, కార్యదర్శి కుళ్లాయ్ రెడ్డి, వెంకటరమణ, ఆదిరంగారెడ్డి పరామర్శించారు. వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అలాగే పుట్లూరు మండలంలోని అరకటివేముల, కొండాపురం, కడవకల్లు, ఓబుళాపురం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి అకాల వర్షం వల్ల రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. పంటలకు ఎకరాకు రూ.50 వేలు, పండ్ల తోటల్లో జరిగిన నష్టానికి ఎకరాకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్.గోపాలక్రిష్ణ, నాయకులు చిన్నిక్రిష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగనమలలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ గాలివానకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కల్లూరులో నేడు గ్రామీణ క్రీడా పోటీలు

గార్లదిన్నె: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని కల్లూరు అగ్రహారం ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద యువకులకు గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం గ్రామస్తులు మాట్లాడుతూ ఇసుక మూట, గుండు, ఇరుసు ఎత్తే పోటీలు, కర్రసాము, బరువు ఎత్తే పోటీలు వంటి గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇసుక మూట పైకి ఎత్తే పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.3,000, రెండో బహుమతి రూ.1,000, గుండు పైకి ఎత్తే పోటీల్లో రూ.3,000, రూ.1,000, కర్రసాము పోటీల్లో రూ.3,000, రూ.2,000, ఇరుసు ఎత్తే పోటీల్లో మొదటి బహుమతి రూ.1,000, రెండో బహుమతి రూ.500, బరువు పైకి ఎత్తే పోటీల్లో మొదటి బహుమతి రూ.3,000, రెండో బహుమతి రూ.1000 అందజేస్తామన్నారు. పోటీలకు హాజరయ్యే వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.

'కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలి'

పామిడి: విశాఖపట్నంలోని మధురవాడలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు చేపట్టాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు టీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థినుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు విద్యార్థినులకు భద్రత కరవైందన్నారు. బాలికపై ఆకృత్యాలకు పాల్పడిన కీచక టీచర్‌పై తక్షణం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షాన విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బైక్‌ల ఢీ - మహిళకు గాయాలు

గుత్తి: పట్టణంలోని కేపీఎస్ సినిమా థియేటర్ సమీపంలో ఆర్ఆర్ హోటల్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వినూత్న అనే మహిళ బైక్‌లో గాంధీ సర్కిల్ వైపు వెళుతుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో వినూత్న తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శ్రీరామనవమి మహోత్సవాలకు ముస్తాబు


కోదండరామస్వామి మూలవిరాట్

గుంతకల్లుటౌన్: పట్టణంలో ప్రసిద్ధి గాంచిన అతి పురాతన కోదండరామస్వామి ఆలయం శ్రీరామనవమి మహోత్సవాలకు ముస్తాబైంది. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ ఈఓ ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 6న శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుష్పాలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 12వ తేదీ సీతారాముల కల్యాణ మహోత్సవం, 13న శ్రీరామ పట్టాభిషేకం, రామతారక మంత్ర హోమం ఉంటుందన్నారు. అదేరోజు సాయంత్రం స్వామి వార్ల ఉత్సవమూర్తులతో పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ మఠం మల్లికార్జున తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని ఆయన కోరారు. నేడు రంగమనాయునిపల్లెలో సీతారామాంజనేయస్వామి తిరునాల పుట్లూరు: మండలంలోని రంగమనాయునిపల్లిలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామాంజనేయస్వామి తిరునాల నిర్వహించనున్నారు. ఆలయం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయ సమీపంలోని మైదానంలో యువకులకు పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించి గెలుపొందిన వృషభాల యజమానులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకోవాలని వారు కోరారు.

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు అగ్రహారం సీతారామాంజనేయ స్వామి దేవాలయం, కొట్టాలపల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామనవమిపండుగ సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఉదయం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాత్రి భజన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే స్వామి వారి గ్రామోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ విస్తృతంగా కృషి చేయాలని ఆ పార్టీ ఎన్నారై వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి సూచించారు. శనివారం బీకేఎస్ వైఎస్సార్ సీపీ నాయకులు సాంబశివారెడ్డిని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం సాంబశివారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ సంక్షేమం కోసం అందరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అధికార పార్టీతో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి అండగా ఉంటామన్నారు. జగనన్న నన్ను చాలా బాధ్యతతో ఎన్నారై వింగ్ కోఆర్డినేటర్‌గా నియమించారన్నారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, పూల నారాయణ స్వామి, స్టోర్ డీలర్ల మాజీ అధ్యక్షుడు ముత్యాల రంగనాథ్, వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ప్రచార కార్యదర్శి పూల రంగనాథ్, ఆది నారాయణ, రవి, పవన్, సాయి బాలాజీ పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

- రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


అలంకరణలో సీతారాములు

బుక్కరాయసముద్రం: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని కొట్టాలపల్లిలో వెలసిన సీతారాములకు గురువారం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. గ్రామంలో సీతారాముల వారి బ్రహ్మోత్సవాలను 10 రోజులుగా గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం గ్రామంలో స్వామి వారిని సతీసమేతంగా పల్లకిపై ఊరేగింపుగా తీసుకొచ్చి ఉదయం 10.20 నుంచి 11 గంటలకు సీతారాముల వారికి కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి మండల వాసులు పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. మధ్యాహ్నం గ్రామస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు దేవాలయంలో రాష్ట్రస్థాయి భజనలు పోటీలు నిర్వ హించనున్నారు. సోమవారం పార్వేట నిర్వహించి, సాయంత్రం సీతారాములను హంస వాహనంపై ఊరేగించనున్నారు .

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి


గుంతకల్లులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నైరుతిరెడ్డి, పార్టీ నాయకులు


తాడిపత్రిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్/గుత్తి/గుత్తిరూరల్/పామిడి/తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం/ గార్లదిన్నె: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లులోని ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లోని ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు వీరేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, కౌన్సిలర్ సుమోబాషా, పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు అంజి, అబ్దుల్‌బాసిద్, షాబుద్దీన్, నాయకులు బావన్న, ఆర్‌డీజీ బాషా, పెయింటర్ హరి, ఎల్లప్ప, మౌలా, కరీమ్, దర్గానాయుడు, జన్నేమస్తాన్, పరుశురాముడు, సుబ్బారావు, రాజశేఖర్,వీరాస్వామి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు.

- గుత్తిలోని గాంధీ సర్కిల్ వద్ద శనివారం ఎమ్మార్పీఎస్, సీపీఐ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంజన్ ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి రామదాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈరన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి నజీర్, సీఐటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు నాగార్జున, చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి మంగే రమేష్, కేవీపీఎస్ అధ్యక్షుడు మల్లికార్జునతదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు నిర్వహించారు.
- పామిడిలో శనివారం వివిధ రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, సాకే ఓబులేసు, ఎంసీ సుంకన్న, మునగల రంగనాయకులు, కుమార్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.
- తాడిపత్రి పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో శనివారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, గౌరవాధ్యక్షుడు శ్రీహరి, సభ్యులు రంగయ్య, నాగభూషనం, కుమారస్వామి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని దినకురగాయల మార్కెట్ వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్, నాయకులు కంబగిరిరాముడు, పైలా నరసింహయ్య, గంగరాజు, కుళ్లాయప్ప, మునయ్య, రాజారత్నం, శివుడు,రంగనాథ్, కంబగిరిస్వామి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

- పెద్దవడుగూరులో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిచారు. గ్రామస్తులు సుంకన్న, శ్రీనివాసులు, మిడుతూరు సుంకన్న, పెద్దన్న, వీరాంజనేయులు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.
- బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నెలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు లోలూరు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం


శింగనమలలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ కౌలుట్లయ్య


గుత్తిలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి

గుత్తి: పట్టణంలోని రాయల్ సర్కిల్లో శనివారం వరిగడ్డి షాషావలి బ్రదర్స్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రషర్ మధుసూదన్ రెడ్డి రిబ్బన్ కత్తిరించి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చలి వేంద్రం దాతలు ఇస్మాయిల్, రఫీ, దస్తగిరి, కుళ్లాయి, వన్నూరప్ప, మక్బూల్, భాస్కర్ రెడ్డి, రంగస్వామి, రజాక్, షెక్షావలి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని పీపీ కాలనీలో సీపీఐ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ కౌలుట్లయ్య శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు తరిమెల రామాంజనేయులు, చిన్న కొండన్న, రవి, వెంకటస్వామి, సూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రబోధానంద జయంతి


ప్రబోధానంద ఆశ్రమంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్నపోలమడ గ్రామంలో శనివారం త్రైత సిద్ధాంత కర్త ప్రబోధానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని శ్రీకృష్ణుడి విగ్రహానికి, ప్రబోధానంద సమాధిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. శ్రీలంక బోధి బిక్షువులు బోధిహీన్, జపాన్ మాంక్ యుఫీజీ ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. త్రైతసిద్ధాంత ప్రబోధా సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు పాల్గొన్నారు.

యర్రగుంట్లలో రేపు వన భోజనాలు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో సోమవారం వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి పండుగ మరుసటి రోజు గ్రామ ప్రజలంతా ఊరు ఖాళీ చేసి సమీపంలోని పొలాల్లోకి వెళ్లి వంట చేసుకుని కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడుపుతామన్నారు. సాయంత్రం ఊరేగింపుగా గ్రామంలోకి వచ్చి బొడ్రాయికి పూజలు చేసి ఇళ్లలోకి వెళ్తారన్నారు. ఇలా చేయడం వల్ల ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండడంతో పాటు వర్షాలు కురిసి.. పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయన్నారు.

సంక్షిప్త సమాచారం

వృద్ధుడి మృతి

పామిడి: పట్టణ తలవాలకట్టవీధికి చెందిన బెల్గాం ఇమామ్‌సాబ్(63) అనంతపురంలోని సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ వీ యుగంధర్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. బంధువులు అతడిని అనంతపురంలని ఆస్పత్రికి తరలించగా.. వైద్యానికి సహకరించక అతడు మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

7 నుంచి రావులుడికి చెన్నమ్మ తిరునాల


చెన్నమ్మ అమ్మవారి మూలవిరాట్


చెన్నమ్మ ఆలయం

పెద్దవడుగూరు: మండల లోని రావులుడికి గ్రామంలో ఈ నెల 7న చెన్నమ్మ దేవత తిరునాల ప్రారంభించనున్నట్లు గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. మొదటి రోజు గంగమ్మ పెట్టి మెరవణి, గంగమ్మ బుర్రకథ ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 8వ తేదీ సుడిబండిని రావులుడికి గ్రామం చుట్టూ తిప్పుతారు. 9న పక్క గ్రామాల ఎద్దులతో సుడిబండిని లాగిస్తారు. 10న భీమునిపల్లికి చెందిన ఎద్దులతో సుడిబండి లాగిస్తారు. 11న నిండు తిరునాల నిర్వహిస్తారు. అలాగే పొంగుపాలు కార్యక్రమం నిర్వహిస్తారు. పచ్చికట్టెలతో మంట పెట్టి పచ్చికుండలో పాలు పోసి పొంగిస్తారు. పాలు ఏ వైపు పొర్లితే ఆ వైపు నుంచి వర్షాలు వస్తాయని ప్రజల నమ్మకం.

చెన్నమ్మ తల్లి జన్మ వృత్తాంతం

చెన్నమ్మ అమ్మవారు రావులుడికిలో సుమారు 420 ఏళ్ల క్రితం చిట్టెంరెడ్డి వారి ఇంట జన్మించారు. చెన్నమ్మ బాల్యం నుండి శివుడి భక్తురాలుగా ఉంటూ అద్భుతమైన మహిమలు చూపుతుండేది. అమ్మవారి మహిమలను తెలుసుకోలేని తల్లిదండ్రులు ఆళ్లగడ్డ దగ్గర ఉన్న బాచుపల్లిలోని మేనమామ బసిరెడ్డి గారి పాపయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అక్కడ కూడా చెన్నమ్మ అమ్మవారు తన మహిమలు చూపారు. దీంతో అక్కడి ప్రజలు అమ్మవారికి ఆలయం కట్టించి పూజలు చేసుకునే భాగ్యం కలిగించమని వేడుకున్నారు. అత్తగారింట పూజలు చేయించుకోవడానికి ఇష్టపడని చెన్నమ్మ అమ్మవారు.. ఇందుకు నిరాకరించి పుట్టినిల్లు వారితో పూజలు చేయించుకోవడానికి రావులుడికిలో మూడు అగ్నిగుండాలు ఏర్పాటు చేసి అందులో ప్రవేశించి ఒకదానిలోంచి మరొక దానిలో నిమ్మకాయ నిలుటద్దములో దర్శనమిచ్చింది. అగ్నిగుండ ప్రవేశ ప్రాంతంలో తనకు గుడి కట్టించి ఏటా తిరునాల జరుపుకోవాలని సూచించారు. అమ్మవారి కోరిక మేరకు ఆరు జతల ఎద్దులతో లాగే సుడిబండిని తయారు చేయంచి తిరునాల జరుపుకోవడం జరుగుతోందని గ్రామపెద్దలు తెలిపారు. అమ్మవారిని కొలిచిన వారికి కొంగుబంగారంగా మారి అందరికీ ఐశ్వర్యం, ఆరోగ్యము, సంతానం ప్రాప్తింపజేస్తుందన్నారు. అప్పటి నుంచి తిరునాల జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.